


# నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I | హైదరాబాద్, శనివారం 4 మే 2024 | VIKARABAD


## ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు

**రంగారెడ్డి జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక**



షాబాద్, మే 3: పార్లమెంటు ఎన్నికల నిర్వహణలో భాగంగా ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రంగారెడ్డి కలెక్టర్ శశాంక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేలా హోం ఓటింగ్ ఫెసిలిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. 54 టీంలతో ఈ నెల 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు హోం ఓటింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గంలో ఏవీఎస్‌సీ 695, ఏవీపీడీ 420 ఓటర్లు ఉండగా, 1115 మంది ఓటర్లు తమ ఓటు హక్కును ఈ హోం ఓటింగ్ ద్వారా వినియోగించుకోనున్నారని తెలిపారు.

# 49 రోజుల్లో..
# రూ.22.51 కోట్ల సొత్తు సీజ్



- ఎన్నికల వేళ ముమ్మరంగా సాగుతున్న తనిఖీలు
- మద్యం, నగదు అక్రమ రవాణా అడ్డుకట్ట వేయడమే లక్ష్యం
- ఇప్పటివరకు రూ.7.95 కోట్ల నగదు పట్టివేత
- భారీగా పట్టుబడుతున్న మద్యం, డ్రగ్స్, బంగారం, వెండి ఆభరణాలు

రంగారెడ్డి, మే 3(నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఓటర్లను ప్రలోభ పెట్టకుండా ఉండేందుకు పోలీసులతోపాటు తనిఖీ బృందాలు పకడ్బందీగా వ్యవహరిస్తున్నాయి. చెక్ పోస్టులు ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాయి. రంగారెడ్డి జిల్లాలో మార్చి 16 నుంచి ఈ నెల 3 వరకు 49 రోజుల్లో రూ.22.51కోట్ల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఇందులో రూ.7.95కోట్ల నగదు ఉండగా.. మిగతా మద్యం, డ్రగ్స్, వెండి, బంగారం వంటి ఆభరణాలు ఉన్నాయి.

### ఇప్పటివరకు స్వాధీనం చేసుకున్న సొత్తు వివరాలు..

- జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన వాహన తనిఖీల్లో బిల్లుల్లేకుండా తరలిస్తున్న రూ.7,95,65,479 నగదును స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం ఆయా కేసులను ఆదాయపన్ను శాఖ అధికారులకు అప్పగించారు.
- ఎలాంటి బిల్లుల్లేకుండా తరలిస్తున్న రూ.7,49,40,388 విలువ జేసే 9,859.8652గ్రాముల బంగారం, రూ.4,18,700 విలువైన 5.30 కిలోల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.
- మద్యం అక్రమ రవాణా, అనధికార విక్రయాలపై దాడులు చేసి రూ.1,32,34,759 విలువ గల 40,743 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశారు.
- మరో రూ. 5,02,89,026 విలువగల 1,838.2403 కిలోల డ్రగ్స్, నార్కోటిక్స్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. వీటితోపాటు రూ.67,49,261 విలువగల ఇతర వస్తువులను సీజ్ చేశారు.


### నిరంతర నిఘా..

లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ ఏప్రిల్ 18న వెలువడగా.. మే 13న పోలింగ్ జరగనున్నది. ఈ మధ్యకాలంలో నగదు, మద్యం తదితర రవాణా ఎక్కువగా జరిగే అవకాశం ఉన్నది. ఓటర్లను ప్రలోభ పెట్టడంలో భాగంగా రాజకీయ పార్టీలు నగదు, మద్యం తదితర వాటిని అక్రమ మార్గంలో తరలించకుండా ఆదిలోనే అడ్డుకట్ట వేసేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్స్ సర్వైలెన్స్ బృందాలు రంగంలోకి దిగి తనిఖీలను ముమ్మరం చేశాయి. కలెక్టరేట్‌లోని మీడియా సెంటర్ సైతం ఈ బృందాలపై ఎప్పటికప్పుడు ప్రత్యేక పర్యవేక్షణ ఉంచుతున్నది. జిల్లాకు నలుమూలల ప్రధాన రహదారులపై చెక్ పోస్టులను ఏర్పాటు చేసి ఇతర జిల్లాల నుంచి నగదు, మద్యం తరలించకుండా నియంత్రించేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రధాన రహదారులపై తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎస్ఎస్‌టీ, వీవీటీ బృందాలు సైతం అక్రమ కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచుతున్నాయి.

### 49 రోజుల వ్యవధిలో..

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి తనిఖీలు నిర్వహించి ఎటువంటి రసీదు లేని వాటిని స్వాధీనం చేసుకుంటున్నారు. అలాగే బ్యాంకు లావాదేవీలపై నిఘా ఉంచుతున్నారు. రూ.10 లక్షలకు పైగా డబ్బు పట్టుబడిన సందర్భంలో ఆదాయ శాఖ అధికారులకు సమాచారం అందజేస్తున్నారు. సరైన ధ్రువీకరణ పత్రాలను చూపించి పట్టుబడిన నగదు, బంగారం, వెండి తదితర వాటిని తిరిగి పొందేందుకు జిల్లా కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేశారు.





శంకర్‌పల్లిలోని రోడ్ షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

- కేసీఆర్ జపం లేకుండా రేవంత్‌రెడ్డికి పొద్దు గడుస్తలేదు..
- ఆరు నెలలు గడుస్తున్నా హామీల ఊసెత్తడం లేదు
- చేవెళ్ల ఎంపీగా కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- శంకర్‌పల్లి రోడ్‌షోలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

# తిట్లు.. ఒట్లతో
# కాంగ్రెస్ కాలయాపన

షాబాద్, మే 3: పొద్దున లేస్తే కేసీఆర్‌ను తిడుతూ.. దేవుళ్ల మీద ఒట్టు పెడుతూ రేవంత్‌రెడ్డి కాలయాపన చేయడం తప్పా రాష్ట్రానికి చేస్తున్నదేమీ లేదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితారెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి శంకర్‌పల్లిలో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్‌తో కలిసి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ పదేండ్లలో కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమానికి ప్రతి గడపకూ తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కేసీఆర్ ఇంటి మీది కాకిని, తమ ఇంటి మీద వాలనివ్వమని చెబుతున్న రేవంత్‌రెడ్డి.. రంజిత్‌రెడ్డి ఏ ఇంటి నుంచి వచ్చాడో తెలువదా అన్ని ప్రశ్నించారు. అంటే ఆయన కాకి కాదేమో.. గద్దనేమో అని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి వచ్చినప్పటి నుంచి కేసీఆర్ జపం లేకుండా బతుకలేకపోతున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్న రేవంత్‌రెడ్డి ఆరు నెలలు గడిచినా ఎందుకు మాఫీ చేయడం లేదన్నారు. ఇదొక్కటే కాదు అధికారంలోకి రావడానికి నోటికి ఏది వస్తే అది మాట్లాడి గద్దెనెక్కిన తరువాత హామీలన్ని విస్మరించారన్నారు. రేవంత్‌రెడ్డి వికారాబాద్ చౌరస్తాకు వచ్చినప్పుడు డిసెంబర్ 9వ తేదీన రైతు రుణమాఫీ చేస్తానన్నారని.. ఇప్పుడేమో ఆగస్టు 15న రుణమాఫీ చేస్తామంటూ మరోసారి రైతులను మోసం చేయాలని చూస్తున్నారన్నారు. కరీంనగర్ పోయి వేములవాడ దేవుడి మీద ఒట్టు, బాసరలో అమ్మవారి మీద, యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహా స్వామి మీద, నగరంలోని పెద్దమ్మ గుడి వద్ద ఒట్టు వేశారని.. ఇక చేవెళ్లకు వస్తే వేంకటేశ్వరస్వామి మీద కూడా ఒట్టు వేస్తారేమోనని అన్నారు. అయితే రేవంత్‌రెడ్డి అవాస్తవాలు తెలిసిన ఇక్కడి వేంకటేశ్వర స్వామి ఆగస్టు 15 దాకా ఆయన ఈ రూట్‌లో రాకపోతే బాగుండునేమో అని అనుకుంటుండొచ్చని అన్నారు. బీజేపీ కేంద్రంలో పదేండ్లు అధికారంలోకి ఉండి తెలంగాణకు ఏమన్నా చేసిందేమో ఆ పార్టీ నాయకులు చెప్పాలన్నారు. కేసీఆర్ పలుమార్లు పోయి మోదీని నిధులు అడిగితే ఇవ్వలేదన్నారు. మోదీని చూసి తనకు ఓటు వేయాలని బీజేపీ అభ్యర్థి అడుగుతున్నాడే తప్పా, తాము తెలంగాణకు ఇది చేశామని చెప్పడానికి ఏమీ లేదన్నారు. ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలిస్తాం, రైతుల ఖాతాల్లో రూ.15లక్షల చొప్పున డబ్బులు వేస్తామని చెప్పిన బీజేపీ.. ఇప్పటివరకు ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. 13వ తేదీన కారు గుర్తుకు ఓటు వేసి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. చేవెళ్ల ఎంపీగా తనను ఆశీర్వదించాలన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ గొంతుక వినిపిస్తానని తెలిపారు. చేవెళ్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్ మాట్లాడుతూ ఎన్నో ఏండ్ల తర్వాత చేవెళ్ల గడ్డపై బీసీనేతకు అవకాశం వచ్చిందన్నారు. ఇక్కడి ఓట్లలో 50శాతానికి పైగా బీసీలు ఉన్నారని, వారందరూ ఏకమై బీసీ బిడ్డ కాసానిని గెలిపించుకోవాలన్నారు. కాంగ్రెస్, బీజేపీలను ఓడించి గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రాంబాబుయాదవ్, ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాపారావు, పీఏసీఎస్ చైర్మన్ బద్దం శశిధర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు గోపాల్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్



శంకర్‌పల్లిలోని రోడ్ షోకు హాజరైన జనం

# మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించుకుందాం

**ఇంటింటికీ ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్**

షాద్‌నగర్‌టౌన్, మే 3: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలుపించుకుందామని మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్యయాదవ్ అన్నారు. మున్సిపాలిటీలోని 23, 24, 25వ వార్డుల్లో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజ్, కౌన్సిలర్లతో కలిసి ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ప్రజలు ఎంతో సుభిక్షంగా ఉన్నారని, ప్రజలకు మేలు జరుగాలంటే కారు గుర్తుకు ఓటు వేయాలన్నారు. నిరంతరం ప్రజల సంక్షేమానికి పాటుపడే బీఆర్ఎస్ పక్షాన ప్రజలు నిలబడాలన్నారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలవారు ఇబ్బందులు పడుతున్నారని, ఆ పార్టీ నేతల మాయామాటలను నమ్మే పరిస్థితిల్లో ప్రజలు లేరన్నారు. ఆరు గ్యారెంటీలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మహిళలకు ఉచిత బస్సు తప్ప ఏ ఒక్క హామీనీ అమలు చేయడం లేదన్నారు. కాంగ్రెస్ హయాంలో కరువు తాండవిస్తున్నదన్నారు. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. బీఆర్ఎస్‌కు ఓటేసి బీజేపీ, కాంగ్రెస్ తగిన బుద్ధి చెపాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వెంకట్రాంరెడ్డి, నందీశ్వర్, జీటీ శ్రీనివాస్, రాజేశ్వర్, నాయకులు ఆకుల శ్రీశైలం, యాదవాచారి, వెంకటేశ్, సుధాకర్, యుగేందర్, శేఖర్, నందకిశోర్, యాదగిరి, సుధీర్, రాఘవేందర్‌రెడ్డి, శ్రీనివాస్, ఏజాజ్, అశోక్, శివాజీ, రాజశేఖర్, శరత్‌కృష్ణ, భాస్కర్ తదిరులు పాల్గొన్నారు.



కారుగుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరుతున్న మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్



కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరిన కందనెల్లి నాయకులకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి

- ఆరు గ్యారెంటీల పేరుతో నట్టేట ముంచింది
- కాసానిని గెలిపించి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి
- స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లలో తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి
- ఆగస్టు 15న రుణమాఫీ చేయకపోతే రాజీనామా చేయాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి సవాల్

# కాంగ్రెస్ పాలనలో 'సంక్షేమం' మాయం

పెద్దేముల్, మే 3 : అసమర్థ కాంగ్రెస్ పాలకుల వల్ల రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదిముబారక్ వంటి బృహత్తరమైన సంక్షేమ పథకాలు ఆగిపోయి ప్రజలు ఆగమవుతున్నారని తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మంబాపూర్, పెద్దేముల్, గాజీపూర్ గ్రామాల్లో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను నట్టేట ముంచిందన్నారు. కరెంటు కోతలు, సాగునీటి ఎద్దడితో అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. మహిళలకు ప్రతి నెలా రూ.2,500, రూ.500లకే గ్యాస్ సిలిండర్, ఏటా రూ.15 వేల రైతుభరోసా, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు, వరి ధాన్యానికి రూ.500 బోనస్, ప్రతి కుటుంబానికీ రూ.200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు, నిరుద్యోగ యువకులకు నెలనెలా రూ.4 వేలు, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు తదితర హామీల అమలు ఏమైందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఆగస్టు 15న రైతు రుణమాఫీ చేస్తామని చెప్పుకుంటూ తిరుగుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి.. ఒకవేళ రుణమాఫీ చేయకపోతే రాజీనామా చేస్తావా సవాల్ విసిరారు. కాంగ్రెస్ నేతల మోసపూరిత మాటలను ప్రజలు నమ్మరన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాగా, రోహిత్‌రెడ్డి సమక్షంలో కందనెల్లి గ్రామానికి చెందిన అంపల్లి రవి, వడ్ల వెంకటేశం కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయ్‌కుమార్, గ్రంథాలయ చైర్మన్ రాజుగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు టి.రమేశ్, మన్సాన్‌పల్లి రవినాయక్, మాజీ సర్పంచులు శ్రావణ్‌కుమార్, పాండు, హైదర్, నాయకులు నాగేందర్, ఇబ్రహీం, అరుణ్‌రాజ్, ఏజాజ్, లాజర్, దత్తు, బోయిని నారాయణ, వెంకటయ్య, సర్వేశ్వర్ రెడ్డి, బలరాం, సాయిలు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.




బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపుతున్న మంబాపూర్ గ్రామ మహిళలు

# మోసపూరిత కాంగ్రెస్‌ను ఓడిద్దాం

- మాజీ ఎమ్మెల్యే ఆనంద్
- ఎన్నారంలో ఇంటింటికీ ఎన్నికల ప్రచారం

వికారాబాద్, మే 3 : మోసపూరిత కాంగ్రెస్‌ను ఓడించి తగిన బుద్ధి చెబుదామని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం కోట్‌పల్లి మండలంలోని ఎన్నారం గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అమలు కాని గ్యారెంటీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. రేవంత్‌రెడ్డి హామీల అమలును పక్కన పెట్టి.. దేవుళ్ల మీద ఒట్లు వేస్తూ కాలయాపన చేస్తున్నారన్నారు. గ్రామాలకు వచ్చే కాంగ్రెస్ నాయకులను ప్రజలు ఆరు గ్యారెంటీలు, రుణమాఫీపై నిలదీయాలన్నారు. కారుగుర్తుకు ఓటు వేసి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో కోట్‌పల్లి మండల అధ్యక్షుడు సుందరి అనిల్, ఏపీసీఎస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్, వైస్ ఎంపీపీ నర్సింహులు, యూత్ అధ్యక్షుడు కొండల్ రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు యాకుబ్, మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్, సీనియర్ నాయకులు జయానంద్, మాజీ సర్పంచ్ రామ్ ప్రసాద్, నాయకులు బాలేశ్, మహబూబ్, హుస్సేన్, మొయినొద్దీన్, వీరేశం, శీను, బాబు నాయక్, రశీద్, అలీ, మజర్, వెంకటేశం, కృష్ణ కుమార్, శ్రీకాంత్ రెడ్డి, అనిల్, రవి తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటికీ ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్